# ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ ఆర్వీ కర్ణన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్వీ కర్ణన్


నల్లగొండ, నవంబర్ 25: పోలింగ్ తేదీ సమీపిస్తున్నందున ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణ ఆదేశించారు. జిల్లాలో పోలింగ్ బూత్‌ల పరిస్థితిలో తీసుకోవలసిన చర్యలపై మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఐసీడీఎస్ అధికారులు స్వీప్ నోడల్ అధికారులతో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆయన శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్లో ఏర్పాటుచేసిన కనీస వసతుల ఏర్పాటును పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పోలింగ్ స్టేషన్లో వికలాంగుల సహాయార్థం ఏర్పాటుచేసిన వీల్ చైర్లు రవాణా సౌకర్యాల పరిస్థితిని సమీక్షించారు. పోలింగ్ సిబ్బందికి భోజన వసతి సక్రమంగా ఉండేలా తజాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో తహసీల్దార్లు సమన్వయం చేసుకొని ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కృషి చేయాలని అన్నారు. ఈ సందర్భం గా జిల్లా పరిషత్ సీఈవో, స్వీప్ నోడల్ అధికారి ప్రేమ్‌కరణ్‌రెడ్డి సీ విజిల్ పై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

### కౌంటింగ్‌కి ఏర్పాట్లు పూర్తి చేయాలి

అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్‌కు కట్టుదిట్టంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కర్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన తిప్పర్తి మండలం అనిశెట్టి దుప్పలపల్లి రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాంలో కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో పరిశీలించారు. నల్గొండ, మిర్యాలగూడ, దేవరకొండ, మునుగోడ్, నకిరేకల్, నాగార్జున సాగర్ నియోజకవర్గాలకు సంబంధించి ఇక్కడే కౌంటింగ్ జరగనున్నట్లు తెలిపారు. కౌంటింగ్ హాల్స్, స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. అన్ని కేంద్రాల్లో విద్యుత్ జనరేటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. స్ట్రాంగ్ రూంల వద్ద సీసీ కెమెరాలు, పటిష్ట భద్రత ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. పీఆర్ ఎస్ఈ తిరుపతయ్య, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ కేవీ రమణా చారి, పరిశ్రమల కేంద్రం జీఎం కోటేశ్వరరావు పాల్గొన్నారు.

### ఓపీఓలు అవగాహన కలిగి ఉండాలి

నల్లగొండ : అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 30న చేపట్టనున్న పోలింగ్ ప్రక్రియ సందర్భంగా నిర్వహించే విధులపై ఓపీఓలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్వీ కర్ణన్ అన్నారు. శనివారం పట్టణంలోని కేపీకే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓపీఓలకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఆ కాలేజీలోని పెసిలిటేషన్ సెంటర్‌లో ఆరు నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన బాక్స్‌లలో ఓపీఓలు, పోలీస్, మైక్రో అబ్జర్వర్లు కూడా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారు. పెద్ద సంఖ్యలో క్యూలో ఉండడంతో అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆర్ఓ రవిని ఆదేశించారు. ఈ శిక్షణాధికారి వెంకయ్య, మ్యాన్ పవర్ నోడల్ అధికారి పార్వతీశ్వర్, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు




## ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌ను మళ్లీ గెలిపించాలి

- బీఆర్ఎస్ జిల్లా నాయకుడు వెంకట్‌రెడ్డి

దేవరకొండరూరల్, నవంబర్25: బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్‌ను మళ్లీ గెలిపించాలని బీఆర్ఎస్ నాయకులు మునికుంట్ల వెంకట్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు శ్రీనునాయక్ అన్నారు. శనివారం మండలంలోని మర్రిచెట్టుతండా, కొండభీమనపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాతూ బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. బీఆర్ఎస్‌ను గెలిపించి కేసీఆర్‌ను మూడో సారి సీఎంను చేయాలని అభ్యర్థించారు. కారు గుర్తుకు ఓటేసి రవీంద్రకుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు కిషన్‌బావోజి, పాండు, బిచ్య, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

## బీఆర్ఎస్ హయాంలోనే అన్ని వర్గాలకు న్యాయం

- ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

శాలిగౌరారం, నవంబర్ 25: బీఆర్ఎస్ హయాంలోనే పేద, బడుగు వర్గాలకు సముచిత న్యాయం జరిగిందని తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని ఊట్కూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ 8వ వార్డు మెంబర్ గుండ్ల వినోదసైదులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొడ్డు రామలింగయ్య, దేవనబోయిన శ్రీనుతో పాటు పలు కుటుంబాలు తిరుమలగిరిలోని ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ నివాసంలో బీఆర్ఎస్‌లోకి చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కిశోర్ మాట్లాడుతూ బీఆర్ఎస్‌లోకి చేరిన వారికి భవిష్యత్‌లో సముచిత స్థానం కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కొత్త, పాత అనే తేడా లేకుండా అందరూ కలిసి కట్టుగా పని చేయాలన్నారు. కారు గుర్తుకు ఓటు వేయించి బీఆర్ఎస్ గెలుపునకు కృషిచేయాలని కోరారు. మహేశ్వరం వెంకన్న, ఈర్ల కిరణ్, వేముల మనోజ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

## అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌లో చేరికలు..

చిట్యాల, నవంబర్ 25 : రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లోకి చేరుతున్నట్లు జై హనుమాన్ పూసల సంఘం అధ్యక్షుడు తన్నీరు అమరేందర్ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన జై హనుమాన్ పూసల సంఘానికి చెందిన దాదాపు 300 కుటుంబాలు శేపూరి రవీందర్ ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సమక్షంలో బీఆర్ఎస్‌లోకి చేరాయి. శేని ఉపేందర్, కంచుకొమ్ముల క్రిష్ణ, పసుపులేటి రాములు, గుండ్లపల్లి నర్సింహ్మా, గుండ్లపల్లి సత్యనారాయణ, పసుపులేటి శ్రీను, బంగారమ్మ, లక్ష్మమ్మ, సైదమ్మ, మారమ్మ తదితరులు బీఆర్ఎస్‌లో చేరినవారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్య, జిట్ట బొందయ్య, సిలివేరు శేఖర్, కోనేటి యల్లయ్యలు పాల్గొన్నారు.

### సుంకెనపల్లి నుంచి 100 మంది

మండలంలోని సుంకెనపల్లికి చెందిన 100 మంది యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు అయిలయ్య, సుంకెనపల్లి సర్పంచ్ బొందయ్య, ఉప సర్పంచ్ బాత రాజు రవీందర్, యాకారి నరేందర్ తదితలు పాల్గొన్నారు.

# రైతు బంధు సాయం@13వేల కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చింది. దాంతో యాసంగి సీజన్ రైతుబంధు సాయానికి ప్రభుత్వం సిద్ధమైంది. సీజన్ ఆరంభం కావడంతో వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నది. నేడు, రేపు ప్రభుత్వ సెలవు దినాలు కావడంతో మంగళవారం నుంచి రైతుబంధు డబ్బులు ఖాతాల్లో జమకానున్నాయి. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుత యాసంగి పెట్టుబడి సాయంగా సుమారు 11 లక్షల మంది రైతులకు 1300 కోట్ల రూపాయలు అందనున్నట్లు అంచనా. వీటితో కలిపి మొత్తం 12 సీజన్లలో ఉమ్మడి జిల్లా రైతాంగానికి రూ.13వేల కోట్లు లబ్ధి చేకూరినట్లు కానున్నది. రైతుబంధు పంపణీకి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్న తరుణంలో రైతాంగంలో ఆనందం వ్యక్తమవుతున్నది. రైతుల పట్ల కేసీఆర్‌కు ఉన్న చిత్తశుద్ధికి ఇది తాజా నిదర్శనమని, మళ్లీ ఆయనే అధికారంలోకి రావాలని సర్వత్రా ఆకాంక్షిస్తున్నారు.

రాష్ట్రంలో కునారిల్లిన వ్యవసాయాన్ని గాడిలో పెట్టేందుకు స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి 24గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నారు. ఇక వీటికి తోడు రైతన్నను సాగు మడిలో ముందుకు నడిపించేందుకు పెట్టుబడి సాయం కోసం ఆలోచించారు. దానికి రైతుబంధు అని పేరు పెట్టి 2018 వానాకాలం సీజన్ నుంచి ఎకరానికి నాలుగు వేల చొప్పున ఏడాదికి రెండు సార్లు పెట్టుబడి సాయం అందించడం మొదలుపెట్టారు. 2018 డిసెంబర్‌లో రెండోసారి అధికారంలోకి రాగానే వానాకాలం నుంచి ఎకరానికి ఐదు వేల చొప్పున ఏడాదిలో రెండు సీజన్లకు కలిపి 10వేల రూపాయల సాయాన్ని అందిస్తూ వస్తున్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఎన్నడూ కూడా రైతుబంధు ఆగలేదు. సీజన్ ప్రారంభం అవుతుందంటే చాలూ... పెట్టుబడికి ఇబ్బందులు లేకుండా నేరుగా రైతుల ఖాతాల్లోకే నగదు బదిలీ చేస్తున్నారు. ఇలా వానాకాలంలో జూన్, జూలైల్లో, యాసంగిలో నవంబర్, డిసెంబర్ మాసాల్లో క్రమం తప్పకుండా రైతుబంధు డబ్బులు ఒక్క పైసా లంచం లేకుండా రైతులకే చెందుతున్నాయి. సీజన్ సీజన్‌కు కొత్తగా పాసుపుస్తకాలు పొందిన రైతులకు సైతం పెట్టుబడి సాయం అందజేస్తున్నారు. ప్రస్తుత యా సంగి సీజన్‌లో సైతం రైతుబంధు డబ్బులు పంపిణీకి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఎన్నికల పేరుతో రైతు వ్యవసాయం ఆగద్దని ప్రత్యేకంగా ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేసి అనుమతి సాధించింది.

### ఎల్లుండి నుంచి షురూ...

ఎన్నికల సంఘం అనుమతించినా ఇవ్వాళ, రేపు ప్రభుత్వ సెలవు దినాలు ఉండడంతో పంపణీకి ఆటంకంగా మారింది. దీంతో మంగళవారం నుంచి రైతుబంధు డబ్బుల పంపిణీ షురూ కానుంది. ఎప్పటిలాగే రైతుల ఖాతాల్లో తొలిరోజూ ఎకరం నుంచి మొదలుకుని భూవిస్తీర్ణంతో సంబంధం లేకుండా దశలవారీగా వారం పది రోజుల్లో రైతులందరికీ రైతుబంధు నగదు జమకానుంది. తొలి రోజూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 3.20లక్షల మంది రైతులకు సంబంధించిన రెండు లక్షల ఎకరాలకు పెట్టుబడి సాయంగా సుమారు రూ.100కోట్ల వరకు రైతులకు అందనున్నట్లు అంచనా.

ఇలా భూవిస్తీర్ణంతో సంబంధం లేకుం డా పట్టాదారు పాసుపుస్తకం ఉన్న చివరి రైతు వరకు రైతుబంధు డబ్బులు ఖాతాల్లో జమకానున్నాయి. ఇక మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే రైతుబంధు సాయం దశలవారీగా ఏడాదికి 16వేల రూపాయలకు పెంచనున్నట్లు ఇప్పటికే కేసీఆర్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో రైతులకు మరింత ప్రయోజనం చేకూరనుంది.

### 11లక్షల మందికి రూ.1300 కోట్లు..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 11లక్షల మంది పైచిలుకు రైతులకు ప్రస్తుత యాసంగిలో పెట్టుబడి సాయం అందనుంది. పెట్టుబడి సాయంగా మొత్తం 1300కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమకానున్నాయి. 2022 యాసంగిలో పెట్టుబడి సాయం పొందిన రైతుల సంఖ్య 10.81లక్షలుగా ఉంది. ఈ ఏడాది వానాకాలంలో అది 11 లక్షల దరిదాపుల్లోకి చేరింది. ప్రస్తుతం సీజన్‌లో రైతుల సంఖ్య 11 లక్షలు దాటనుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. నల్లగొండ జిల్లాలో 5.30 లక్షలు, సూర్యాపేట జిల్లాలో 3.10లక్షలు, యాదాద్రి జిల్లాలో 2.71లక్షల మంది రైతులు అర్హులుగా అంచనా. ఈ సీజన్‌లో పోడు రైతులతో పాటు కొత్తగా పాసుపుస్తకాలు పొందిన రైతుల వివరాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉన్నట్లు చెబుతున్నారు. వీరికి కూడా ఈ ధపాలో రైతుబంధు అందించనున్నారు.

### 12 విడతల్లో రూ.13000 కోట్లు

రాష్ట్రంలోనే రైతుబంధు ద్వారా అత్యధిక ప్రయోజనం పొందే జిల్లా ఉమ్మడి నల్లగొండనే. సీజన్ సీజన్‌కు ఈ సంఖ్య భారీగా పెరుగుతూ వస్తోంది. పథకం ప్రారంభం అయిన నాటి నుంచి మొత్తం 11 సీజన్లలో నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో కలిపి మొత్తం రూ.11,700 కోట్ల వరకు రైతులకు పెట్టుబడి సాయంగా అందింది. ప్రస్తుత యాసంగిలో మరో 1300 కోట్ల రూపాయలు రైతులకు చేరనున్నాయి. మొత్తంగా 12 విడతల్లో కలిపి సుమారు 13వేల కోట్ల రూపాయలు ఉమ్మడి జిల్లా రైతాంగానికి చెందనున్నాయి. ఇన్ని కోట్ల రూపాయల్లోనే ఒక్క రూపాయి పక్కదారి పట్టకుండా ప్రతీ పైసా నేరుగా రైతుకే చెందేలా అత్యంత పకడ్బందీగా పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఒక్క రూపాయి కూడా ఎవ్వరికీ లంచం ఇవ్వకుండా నేరుగా రైతులకే చెందుతున్నాయంటే అందుకు ప్రభుత్వం పాటిస్తున్న పారదర్శకత, చిత్తశుద్ధినే కారణం. సమైక్య పాలనలో ఏ ప్రభుత్వ పథకంలోనైనా 20 నుంచి 30శాతం వరకు నిధులు దళారుల, అక్రమార్కుల జేబుల్లోకే చేరేవన్నది కాదనలేని సత్యం.